ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

ఉద్యోగం పేరిట రూ.54 లక్షలకు టోకరా

తిరుపతి(నేరవిభాగం): ఉద్యోగం పేరిట మోసగాళ్లు టోకరా ఇవ్వడంతో తిరుపతి రూరల్ సరస్వతీ నగర్‌లోకు చెందిన ఆర్.సుజాత రూ.54 లక్షలు పోగొట్టుకున్నట్లు సీఐ చిన్నగోవిందు మంగళవారం తెలిపారు. 'ఆమె భర్త సింగపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. పార్ట్‌టైమ్ జాబ్‌కు అవకాశం ఉందని ఆమెకు లింకు పంపారు. ఆ ప్రకారం ఆమె టెలిగ్రామ్ గ్రూపులో చేరారు. వీరికి దశలవారీగా డిసెంబరు 14 నుంచి 24 వరకు రూ.54 లక్షలు పంపారు. చివరకు మోసపోయానని గుర్తించి ఫిర్యాదు చేశారు' అని సీఐ వివరించారు.

కొత్త ఏడాదిలో..

జిల్లా ప్రగతి రథాలు

పారిశ్రామికం, పర్యాటకం

'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ వెంకటేశ్వర్



గతం ఒక జ్ఞాపకం. భవిష్యత్తు ఒక ఆశ. గతం ఎన్ని గాయాలు చేసినా భవిష్యత్తు దిశగా నడిపించేది ఆ ఆశే! కలలకు రెక్కలు తొడిగి నేడు 2025లోకి అడుగుపెడుతున్నాం. ఈ సందర్భంగా జిల్లా రథసారథి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌తో ఆంధ్రజ్యోతి సంభాషణ ఇది. జిల్లా అభివృద్ధికి 2025లో పెట్టుకున్న లక్ష్యాలు.. ప్రాధాన్యాలు.. వాటి సాకారానికి చేస్తున్న ప్రయత్నాలను.. జిల్లా ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన ఇలా వివరించారు.

- తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి

పారిశ్రామిక, పర్యాటక రంగాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటున్నాం. పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు కల్పిస్తాం. ఏర్పేడు వద్ద ఎలక్ట్రానిక్ క్లస్టర్ ఏర్పాటుకు 7 వేల ఎకరాలు కేటాయించాం. కృష్ణపట్నం పోర్టు వద్ద క్రిష్ సిటీ (కృష్ణపట్నం ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ) ప్రాజెక్టులో భాగంగా రూ.1,500 కోట్లతో పారిశ్రామిక కారిడార్ సిద్ధం అవుతోంది. పలు జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు అక్కడికి వస్తున్నాయి. దీనివల్ల తిరుపతి జిల్లాకు చాలా మేలు జరుగుతుంది. ప్రస్తుతం శ్రీసిటీ 8వేల ఎకరాల్లో ఉంది. మరో 2వేల ఎకరాలు భూసేకరణ సిద్ధం చేసి పెట్టాం. కొన్ని అంతర్జాతీయ పరిశ్రమలు అక్కడ ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి.

పరిశ్రమలకు రాయితీలు

అభివృద్ధికి రాదారులు

వివిధ రాష్ట్రాలను కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణ పనులు కూడా వేగవంతమయ్యాయి. తిరుపతి-చెన్నై, తిరుపతి-మదనపల్లెతో పాటు సాగరమాల రోడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఇవన్నీ జిల్లా అభివృద్ధిని వేగవంతం చేస్తాయి.

ఆధ్యాత్మిక పర్యాటకం

జిల్లాగా ఏర్పడిన తరువాత తిరుపతికి తీర ప్రాంతం కలిసొచ్చింది. తిరుమల క్షేత్రం ఇక్కడే ఉంది. శ్రీకాళహస్తి, తిరుచానూరు సహా అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. ఇందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

యువతకు ఉపాధి

తిరుమలకు దేశ, విదేశాల నుంచి నిత్యం వేలాది మంది తరలివస్తున్నారు. వారు రెండు రోజుల పాటు జిల్లాలోనే ఉండేలా చూడగలగాలి. ఆహ్లాదంగా గడపడానికి ఎన్నో ప్రదేశాలున్నాయి. జలపాతాలు, బీచ్‌లు, పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల కేంద్రం, షార్ సందర్శించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. పర్యాటక రంగం అభివృద్ధి వల్ల ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయి.

మెట్రోలకు దీటుగా తిరుపతి

ఏడాదిలో.. మెట్రో నగరాలతో పోటీపడేలా తిరుపతిని అభివృద్ధి చేయాలన్న సీఎం చంద్రబాబు సంకల్పాన్ని సాకారం చేస్తాం. అందుకు ప్రణాళికలు రూపొందించాం.

వ్యవసాయంలో సాంకేతికత

వ్యవసాయం మీద ఆధారపడిన తిరుపతి జిల్లాలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక వ్యవస్థను తీసుకొస్తున్నాం. అందులో డ్రోన్ వ్యవస్థ ప్రధానమైంది. ఉద్యానవన పంట ల్లో మామిడే కాకుండా ఇతర పంటలపై కూడా రైతులకు ఆసక్తికలిగేలా పలు రాయితీలు ఇవ్వాలని నిర్ణయించాం. తీర ప్రాంతంలో ఆక్వా, చేపల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నాం.

చెత్తరహిత పట్టణాలు

చెత్త రహిత పట్టణాలుగా ప్రతి మున్సిపాలిటీకి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తాం.

హాస్టళ్లలో మౌలిక వసతులు

జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో చదివే వారంతా పేదలే.ప్రతి హాస్టల్‌లో మౌలిక వసతులు ఉండే విధంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వాటితో పేదపిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు సరైన వసతి ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. కొత్త ఏడాదిలో దీనిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

కులగణన సామాజిక తనిఖీ గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్): కులగణనపై సామాజిక తనిఖీ గడువును ఏడో తేదీ వరకు పెంచినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 11వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. తుది వివరాలను 17న సచివాలయాల్లో ప్రదర్శిస్తామని వివరించారు.

యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

చంద్రగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని ఎంఆర్సీ భవనం వద్ద మంగళవారం యూటీఎఫ్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు, యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు రామిరెడ్డి, అధ్యక్షుడు రాజేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి ధనంజయ, కోశాధికారి చెంచయ్య, సభ్యులు పాల్గొన్నారు.



పుణ్యక్షేత్రాలకు నేడు అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకొని బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రాలకు అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు సెంట్రల్ బస్సు స్టేషన్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు పేర్కొన్నారు. తొలి రోజున దేవాలయాల సందర్శనార్థం ఏర్పడే రద్దీని దృష్టిలో ఉంచుకొని డీపీటీవో జగదీష్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తికి 6, కాణిపాకానికి 8, అప్పలాయగుంటకు 4బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రతి అరగంటకు ఓ బస్సు అందుబాటు ఉంచుతామన్నారు.

కోర్టులో నూతన సంవత్సర వేడుకలు

పాకాల, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తి పూర్ణిమదేవి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బి.చిన్నరెడ్డప్పనాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.





రుయాలో వేడుకలకు అనుమతి లేదు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి ప్రభుత్వం గత నెల 28 నుంచి జనవరి 1 వరకు సంతాప దినాలుగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రుయాస్పత్రిలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించరాదని సూపరింటెండెంట్ రవిప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది ఎవరికీ శాలువాలు కప్పడం, పుష్పగుచ్ఛాలు అందజేయడం, కేకులు కట్ చేయడం వంటివి చేయరాదని స్పష్టంచేశారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించండి

తిరుపతి(విద్య), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషిచేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఎస్టీయూ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ మంగళవారం సాయంత్రం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతిపై ఎస్టీయూ రూపొందించిన ప్రత్యేక క్యాలెండర్ బాగుందని ప్రశంసించారు. నూతన సంవత్సరంలో ప్రభుత్వం విద్యారంగ పథకాలను అమలు చేయడంలో మన జిల్లాను ముందు వరుసలో నిలపాలని సూచించారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ధనుంజయనాయుడు, జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి జగన్నాథం, ఆర్థిక కార్యదర్శి కటారి మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు మునికృష్ణమనాయుడు, రామాంజ నేయులు, వాసు, రమణారెడ్డి, మంచినీళ్ల వెంకటరమణ, గుమ్మడి మురళి, మునిశేఖర్, నరసింహులు, గిరి, సురేష్, మహేష్, శరత్, ఎస్టీయూ భవన కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

















ఎస్వీయూలో ట్రాప్ కెమెరాల ఏర్పాటు

- చిరుత కదలికలను పసిగట్టేందుకు చర్యలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 31: చిరుత సంచారం నేపథ్యంలో ఎస్వీయూలో పది ట్రాప్ కెమెరాలు ఏర్పాటయ్యాయి. యూనివర్సిటీ



అధికారుల విన్నపం మేరకు అటవీ అధికారులు ఈ కెమెరాలను చెట్లకు ఏర్పాటు చేశారు. తద్వారా ఏ ప్రాంతంలో, ఏ సమయంలో చిరుత సంచరిస్తుందో గుర్తించనున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. అయినా రాత్రి వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు బయట సంచరించవద్దని కోరారు.

చోరీకి కాదేదీ అనర్హం..!

వీధి దీప స్తంభాన్నీ వదలని వైనం



తిరుపతి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): చోరీకి కాదేదీ అనర్హం అన్నట్లు తయారయ్యారు తిరుపతిలో దొంగలు. ఈ మధ్య ఓ యాచికుడు గరుడవారధి కింద డివైడర్‌కు ఏర్పాటుచేసిన ఇనుపకమ్మీలను విరిచి తీసు కెళ్లాడు. ప్రస్తుతం తిరుమల బైపాస్‌రోడ్డు, సీపీ ఆర్ అపార్టుమెంటుకు ఎదురుగా పుట్‌పాత్‌పై అమర్చిన విద్యుత్ దీప స్తంభం సగమే ఉంది. మిగిలిన సంగాన్ని గుర్తుతెలియని వ్యక్తులు విరిచేసి దోచుకెళ్లిపోరారు. అధికారులు స్పందించి స్తంభాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

పెన్షన్..హ్యాపీ

- ఒకరోజు ముందే అందుకున్న లబ్ధిదారులు
- పంపిణీ చేసిన అధికార యంత్రాంగం

తిరుపతి, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): నూతన ఆంగ్ల ఏడాది జనవరి ఒకటో తేదీన పింఛను అందుకోవాల్సిన లబ్ధిదారులు ఒక్కరోజు ముందుగానే అందుకున్నారు. దీంతో వారు ఆనందపడ్డారు. తిరుపతి బొమ్మగుంట, ఎస్టీటీ కాలనీలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు పంపిణీ చేశారు. నూతన సంవత్సర కానుకగా ఉగాది నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనుందని తెలియజేశారు. సూపర్ సిక్స్‌లోని అన్ని పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కమిషనర్ ఎస్.మౌర్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్లు సీకే రేవతి, కల్పనా యాదవ్, టీడీపీ నాయకులు ఊకా విజయకుమార్, ఆముదాల తులసీరాం, జనసేన నేతలు రాజారెడ్డి, ఆము దాల వెంకటేష్, నగరపాలక సంస్థ రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, సూపరింటెండెంట్ మధుబాబు, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



35వ డివిజన్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ఆర్‌సీ.మునికృష్ణ, టీడీపీ నాయకులు శ్రీధర్, శ్రీలక్ష్మి, జగ్గా రవితేజనాయుడు, సుజాతమ్మ, మైనం సురేష్ తదితరులు

కో-ఆప్‌టెక్స్‌ను లాభాల్లోకి తెచ్చాం

తమిళనాడు మంత్రి గాంధీ



కో-ఆప్‌టెక్స్‌ను ప్రారంభిస్తున్న తమిళనాడు మంత్రి గాంధీ, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): డీఎంకే అధికారంలోనే కో-ఆప్‌టెక్స్‌ను లాభాల్లోకి తెచ్చామని తమిళనాడు మంత్రి గాంధీ అన్నారు. తమిళనాడు ప్రభుత్వం రూ. 40లక్షలతో స్థానిక గాంధీరోడ్డులో ఆధునీకరించిన కో-ఆప్‌టెక్స్ షోరూంను మంగళవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆయన ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా 150 కోఆప్‌టెక్స్ షోరూంలు ఉండగా 48 ఆధునీకరించామని మంత్రి వివరించారు. చేనేత వస్త్రాలను ప్రజలందరూ వినియోగించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కార్పొరేటర్ పొన్నాల చంద్ర, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2,55,828 మందికి పింఛన్ల పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో భాగంగా మంగళవారం 2,63,995మందిగాను 2,55,828మందికి రూ.108కోట్లు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ మేరకు డీఆర్డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. రాష్ట్రంలోనే రెండో స్థానంలో జిల్లా నిలిచింది. మిగిలినవారికి గురువారం ఇవ్వనున్నారు. వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేశారు.

ఎవరూ బొకేలు, కేకులు తేవద్దు

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మరణానికి రాష్ట్ర ప్రభుత్వం సంతాప దినాలు ప్రకటించిందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. కొత్త సంవత్సరం పురస్కరించుకుని కలెక్టరేట్‌కు బొకేలు, కేక్‌లు ఎవరూ తీసుకురావద్దని పేర్కొన్నారు.

జర్నలిస్టు అక్రిడేషన్ కార్డుల గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును ఫిబ్రవరి నెలాఖరు వరకు పెంచుతున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మీడియా యాజమాన్యం, సంస్థలో పనిచేస్తున్న పాత్రికేయులు వివరాలు తిరుపతిలోని పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వీలైనంత త్వరగా అందజేయాలని కోరారు.

విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై 7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ


కె.సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల పెంపు, తగ్గింపు ప్రతిపాదనలపై ఈనెల 7 నుంచి మూడురోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. ఏపీఈఆర్సీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తెలిపారు. సదరన్ డిస్కం పరిధిలోని సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పించామన్నారు. వినియోగదారులు సూచనలు,అభ్యంతరాలు, అభిప్రాయాలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

రూ.1500 బాకీ కోసం హత్య


అజంతుల్లా మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రూ.1500 బాకీకి సంబంధించి జరిగిన వివాదంలో ఒకరిని హత్య చేశారు. ఈస్ట్ పోలీసుల కథనం మేరకు... ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో మహబూబ్ బాషా టమోటా హోల్‌సేల్ దుకాణం నిర్వహిస్తున్నారు. నిమ్మకాయలవీధికి చెందిన రుద్ర ఇతడికి రూ.1500 బాకీ పడ్డారు. మంగళవారం దుకాణం వద్దకు రుద్ర రాగా బాకీ ఇవ్వాలని మహబూబ్ బాషా అడిగారు. పది మందిలో అడుగుతావా అంటూ అతడు దాడి చేశారు. ఆ షాపులో పనిచేసే అజంతుల్లా(38) రుద్రను అడ్డుకోగా అక్కడివారు సర్దిచెప్పి పంపించేశారు. కాసేపటికే తన ఇద్దరు కుమారులు, మరో ఐదారుమందిని తీసుకుని రుద్ర అక్కడకు వచ్చి గొడవకు దిగారు. ఈ క్రమంలో రుద్ర కుమారుడు కత్తితో అజంతుల్లాపై దాడి చేయడంతో అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడి వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా కాసేపటికే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మహబూబ్ బాషా చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటనారాయణ, ఈస్ట్ సీఐ రామకృష్ణ, వేలిముద్రల నిపుణలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రుద్ర, అతని కుమారులు యశ్వంత్, కల్యాణ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఆలయం ముందు వరాహాల పరుగులు


వరాహాలను తరుముతున్న సెక్యూరిటీ

తిరుమల, డిసెంబరు31(ఆంధ్ర జ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయం ముందు మూడు అడవి పందులు మంగళవారం భద్రతా సిబ్బందిని పరుగులు పెట్టించాయి. వీఐపీ బ్రేక్ దర్శనాలు జరుగుతున్న సమయంలో రెండు పిల్లలతో ఒక వరాహం ఆలయం ముందుకు వచ్చేసింది. పిల్లలున్న వరాహం ప్రమాదకరం కావడంతో భక్తులు ఆందోళన చెందారు. భద్రతా సిబ్బంది గుర్తించి వాటి వెనుకపడి తరమాల్సి వచ్చింది. కాటేజీలు, హోటళ్ల వద్ద వదిలేసిన తినుబండారాల కోసం వచ్చే వరాహాలు అప్పుడప్పుడు ఆలయం ముందుకు, మాడవీధుల్లోకి ఇలా వచ్చేస్తున్నాయి.

ఎంజేపీబీ ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ

సత్యవేడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మహాత్మ జ్యోతీబా ఫూలే బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో సత్యసాయి జిల్లా పేరూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను ఇక్కడకు బదిలీ చేశారు.

పెంచిన పింఛన్లతో లబ్ధిదారుల్లో సంతోషం





పింఛన్లు పంపిణీ చేస్తున్న బొజ్జల బృందమ్మ, బుజ్జి తదితరులు - నారాయణవనం పట్టణంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పెంచిన పింఛన్లతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే సుధీర్ తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని 16, 33 వార్డుల్లో మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఆమె పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు పెంచారన్నారు. రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అంకయ్య చౌదరి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు ఆర్ముగం, వెంకటరమణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్పుకు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లలో స్పౌజ్ కేటగిరి పింఛన్ల పేరిట మరో కేటగిరిని సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని ఇది మార్పుకు శ్రీకారం అని టీడీపీ రాష్ట్ర సాంస్కృతి విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి అన్నారు. పట్టణంలోని 22వ వార్డు పరిధిలో మురళినాయుడు మరణించడంతో ఆ పింఛను అతని భార్య ఉష పేరిట పింఛను మంజూరు అయింది. దీంతో ఆమెకు మంగళవారం పింఛను పంపిణీ చేశారు.

నారాయణవనం: పట్టణంలో మంగళవారం ఫించన్ల పంపిణీలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు దివ్యాంగులకు పించన్లు పంపిణీ చేశారు.

రేణిగుంట: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఎన్టీఆర్ భరోసా ఫించను పంపిణీ జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకటో తేదీకి ముందు రోజే అందించారు. 19 పంచాయతీ లలోని లబ్దిదారులకు మొత్తం రూ.3 కోట్ల 83లక్షల 24వేల రూపాయలను పంపిణీ చేశారు. కాగా ఎటువంటి నిబంధనలు లేకుండా స్పౌజ్ కేటగిరీ కింద రాష్ట్రంలోని మొదటి సారి రేణిగుంట పట్టణంలోని పాంచాలి నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మికి వితంతు పింఛను అందించారు. భాగ్యలక్ష్మి భర్త రాజేంద్ర అనారోగ్యంతో మృతి చెందాడని, అందుకే ఆమెకు పింఛను అందించినట్టు టీడీపీ పట్టణ అధ్యక్షుడు మెహబూబ్ బాషా చెప్పారు.



రేణిగుంట పట్టణంలోని పాంచాలినగర్‌లో స్పౌజ్ కేటగిరీలో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా హరీష్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా ఆర్ హరీష్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆయన్ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యంరెడ్డి, రమేష్‌బాబు, అమర్‌నాథ్, డిల్లీ, సుకుమార్, చిలకా రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీగంధం చెట్టు నరికిందెవరు?

భరద్వాజ తీర్థంలో బరితెగించిన దుండగులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని భరద్వాజ తీర్థంలో గుర్తు తెలియని దుండగులు శ్రీగంధం చెట్టును నరికివేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తిలో మంగళవారం చర్చనీయాంశంగా మారింది. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా భరద్వాజ తీర్థం ఉంది. ఇక్కడ నిరంతరం సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణ కొనసాగుతోంది. భరద్వాజ తీర్థం పుష్కరణికి ఆనుకుని ఉత్తరం వైపున సుమారు 30 అంగుళాల చుట్టు కొలత శ్రీగంధం చెట్టు ఉండేది. కోనేరును వీక్షించే భక్తులతో పాటు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే వారు ఈ చెట్టు పచ్చదనాన్ని ఆస్వాదించేవారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు శ్రీగంధం చెట్టును దర్జాగా రంపంతో కోసేశారు. ఆ తరువాత మొదలు భాగంగా బాగా ముదిరిన దుంగను మాత్రం దొంగలు దోచుకెళ్లారు. ఉదయం



వాకింగ్ చేసేందుకు వచ్చిన కొందరు భక్తులు ఈ దురాగతాన్ని చూసి విస్తుపోయారు. ముక్కంటి ఆలయ అధికారులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదుచేశారు. అటవీశాఖ సిబ్బంది అక్కడికి4 చేరుకుని చెట్టు నరికివేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో శ్రీగంధం చెట్టును నరికివేసిన కారకులను గుర్తించాలని హిందూ ధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. విధుల నిర్వహణ లోపంతోనే ఈ ఘటన జరిగిందన్నారు.



పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

పుత్తూరు

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయ శుద్ధి కోసం బయలు దేరుతున్న అర్చకులు, ఆలయ అధికారులు

వడమాలపేట, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ద్వాదశి ఉత్సవాల సందర్భంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమజంనం కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పయ్యాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ నలుమూలలా శుద్ధి చేశారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను శుద్ధిచేశారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, తదితర సుగంధ ద్రవ్యాలతో ఆలయంలో, ప్రసన్న ఆంజనేయ స్వామి, పద్మావతి, ఆండాల్ అమ్మవారి ఆలయలను సంప్రోక్షణ చేసి శుద్ధి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో ప్రభాకర్, సూపరింటెండెంట్ శ్రీవాణి, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయం



అప్పలాయగుంటలో పింఛను అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో లబ్ధిదారులు ఆరోగ్య భద్రతే లక్ష్యంగా నిర్దిష్ట కాలపరిమితి లోగానే పింఛన్లు అందిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. మంగళవారం అప్పలాయగుంటలో పోలియోతో బాధపడుతున్న మునిరత్నంకు రూ.15 వేల పింఛన్‌ను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో కలిసి అందజేశారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ మండలంలో కల్లూరు, జీహెచ్‌పురంలో పింఛన్లు అందించారు.

ఆంగ్ల సంవత్సరాదికి ముస్తాబైన ఆలయాలు



పుత్తూరు టౌన్, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా పుత్తూరు మండలంలోని పలు ఆలయాలు ముస్తాబు చేశారు. పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, సుబ్రమణ్యంస్వామి ఆలయం, ఆరేటమ్మ ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు ఏర్పాట్లు చేశారు.

ఉషోదయ వాకర్స్‌కు అవార్డుల పంట



అవార్డులతో వాకర్స్ అసోసియేషన్ నాయకులు

పుత్తూరు, డిశంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్‌కు వివిధ విభాగాల్లో పలు అవార్డులు వచ్చాయి. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా గవర్నర్ మాధవనాయుడు హాజరయ్యారు. ఇటీవల ఏలూరులో జరిగిన 2025 ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకారంతో పాటు గత ఏడాది ఉత్తమ సేవలు అందించిన అసోసియేషన్లకు అవార్డులను అందించారు. తమ అసోసియేషన్‌కు ఉత్తమ మెడికల్ క్యాంపు, ఉత్తమ సర్వీసు, బెస్ట్ అప్లికేషన్, బెస్ట్ కన్వీనర్ అవార్డులు వచ్చాయని గౌరవాధ్యక్షుడు కోనేటి రవిరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బాబు, కార్యదర్శి రామోహన్‌వర్మ, కోశాధికారి లోకనాథ నాయుడు, రమేష్‌రాజు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియాకి నోటీసులు

శుభ్రత పాటించాలని కమిషనర్ మౌర్య ఆదేశం

తిరుపతి, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో పారిశుధ్యం సక్రమంగా లేకపోవడంతో ఏపీఐఐసీ వారికి నోటీసులు జారీ చేయాలని అధికారులను కమిషనర్ మౌర్య ఆదేశించారు. మంగళవారం ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా, జీవకోన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, రోడ్లపై గుంతలు పూడ్చే విధానాన్ని ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో కలసి ఆమె పరిశీలించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో రోడ్లపై పక్కన ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు, టైర్లు పడేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరి దుకాణాల పరిసరాలను వారు శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ఏరియా నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నా ఏపీఐఐసీకి చెందినదన్నారు. తాము పారిశుధ్య పనులు చేయాలంటే యూజర్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఆటోనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. గతంలో ఒక సారి నోటీసులు ఇచ్చినా సరైన స్పందన లేకపోవడంతో తిరిగి నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు. ఏపీఐఐసీ, దుకాణదారులతో త్వరలోనే సమావేశం నిర్వహించి, పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టేందుకు చర్యలు చేపడతామని అన్నారు. నగరంలో ఏర్పడిన గుంతలు పూడ్చుతున్నామన్నారు. కమిషనర్ వెంట కార్పొరేటర్ అన్నా అనిత, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ. రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు.

జూడో పోటీల్లో తిరుపతి బాలబాలికలు ప్రతిభ

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని నాగార్జున యూనివర్శిటీలో గతనెల 27నుంచి 29వరకు జరిగిన జూడో స్టేట్ చాంపియన్‌షిప్‌లో తిరుపతి బాలబాలికలు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి దాదాపు 400మంది క్యాడెట్, సీనియర్, సబ్‌జూనియర్ విభాగాల క్రీడాకారులు ప్రాతినిథ్యం వహించారు. ఇందులో తిరుపతికి చెందిన 11మంది బాలబాలికలు అత్యుత్తమంగా రాణించి మెడల్స్ సాధించారు. మొదటిస్థానంలో గెలుపొందిన ఝాన్సీ, పార్థసారధి, రాంచరణ్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4నుంచి 8వరకు ఢిల్లీలో జరగనున్న జూడో సీనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు, జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, జూడో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి జగదీష్, కోచ్ గోపిలు అభినందించారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

● ఝాన్సీ (సీనియర్, క్యాడెట్ విభాగంలో) రెండు స్వర్ణ పతకాలు, ● పార్థసారథి(సీనియర్ విభాగంలో)గోల్డ్, ● రాంచరణ్ (క్యాడెట్ విభాగంలో) గోల్డ్, ● అశోక్, నవీన్, భరత్‌లు (క్యాడెట్ విభాగంలో) సిల్వర్, ● చాణిక్య, ప్రదీప్(సీనియర్ విభాగంలో) సిల్వర్, ● వసంత్(క్యాడెట్ విభాగంలో) కాంస్యం, ● ముకేష్‌ఈశ్వర్, పవన్‌కల్యాణ్ (సబ్‌జూనియర్ విభాగంలో) కాంస్య పతకం సాధించారు.

మైమ్‌లో మొదటి స్థానం

దక్షిణాది సాంస్కృతికోత్సవంలో పద్మావతి వర్సిటీ ఘనత



ట్రోఫీ అందుకుంటున్న కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో నిర్వహించిన దక్షిణాది యువజనోత్సవాల్లో పద్మావతి మహిళా యూనివర్సిటీ తన ఘనతను చాటుకుంది. మైమ్‌లో మొదటి స్థానం, స్కిట్‌కు ద్వితీయ స్థానం, లిటరరీ విభాగంలో మొదటి స్థానం, కల్చరల్ ర్యాలీలో ఐదవ స్థానం, ఫోక్ డ్యాన్స్, డిబేట్‌లో నాల్గవ స్థానం, రంగోళి, మెహందీలో ఐదవ స్థానం .. ఇలా మొత్తం తొమ్మిది బహుమతులు పొందారు. వీరిని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు. ఈ విజయం యూనివర్సిటీకి గర్వకారణమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

స్విమ్స్‌లో సంక్లిష్టమైన ఆపరేషన్ సక్సెస్


కోలుకున్న శ్యామలతో డైరెక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గుండె, ఊపిరి తిత్తుల సమస్యతో తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న మహిళకు అతి క్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ఆమె ప్రాణాలు కాపాడినట్లు స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లా వెల్లిగరానికి చెందిన శ్యామల శ్వాస సమస్యతోపాటు, రెండురోజులుగా మూత్రం రాకుండా ఇబ్బంది పడుతూ ఈ నెల 10న స్విమ్స్‌లో చేరారు. వైద్యులు పరీక్షించి ఆమె గుండెలోని కవాటం దెబ్బతిని ఉండటంతో పాటు ఆమె గుండె సాధారణం కంటే రెండింతలు అధికంగా కొట్టుకుంటూ ఉండడాన్ని గుర్తించారు. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలోనే గుండెపోటు కూడా రావడంతో సీటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో అతిక్లిష్టమైన సర్జరీ చేశారు. ఆమె పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జి చేశారు. సకాలంలో సర్జరీ చేసి రోగి ప్రాణాలు కాపాడిన వైద్య బృందాన్ని స్విమ్స్ డైరెక్టర్ అభినందించారు.

ఉద్యోగ విరమణ పోలీసు అధికారులకు సన్మానం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఎస్పీ సుబ్బరాయుడు నేతృత్వంలో మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. ఉద్యోగ విరమణ పొందిన సూళ్లూరుపేట స్టేషన్ ఎస్ఐ ఎం.వేణుగోపాల్, ఆర్ఎస్ఐ త్యాగరాజులు నాయుడు, కోదండస్వామి నాయక్, తిరుపతి పశ్చిమ స్టేషన్ ఏఎస్ఐ రాజేంద్రన్, ఏఎస్ఐ వాసుదేవన్, తిరుపతి రిజర్వు ఎస్ఐ బలరామయ్య, విమానాశ్రయ స్టేషన్ కానిస్టేబుల్ గోవింద మొదలియార్‌ను జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ ఘనంగా సన్మానించి సత్కరించారు. ఎఎస్పీలు వెంకట్రావు, శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.























రక్తదానం ప్రాణదానంతో సమానం



తిరుపతి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షులు శంకర్‌యాదవ్ సూచించారు. మంగళవారం స్థానిక కేటీరోడ్డులోని ఆయన కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్నేహితులు, అభిమానులు దాదాపు 100మంది రక్తదానం చేశారు. బుధవారం ఆయన జన్మదినం పురస్కరించుకొని రుయా ఆస్పత్రి ముందు పేదలకు అన్నదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, అవినాష్, సాయి, శీను, చైతన్య, నితీష్ పాల్గొన్నారు.

రూ 2.82 లక్షల మద్యం ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో సీజ్ చేసిన రూ.27,000 విలువైన డ్యూటీ పెయిడ్ లిక్కర్ 229 బాటిళ్లను, రూ 2.28లక్షలు విలువ కలిగిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ 2880 బాటిళ్లను, 55 లీటర్ల సారాను నాగలాపురంలో మంగళవారం అధికారులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, అదనపు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, ఎన్‌ఫోర్సుమెంటు సీఐ శ్యామ్, నాగలాపురం ఎక్సైజ్ సీఐ దశరధ, సిబ్బంది పాల్గొన్నారు.

పార్థసారధికి డాక్టరేట్



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 31: ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఉద్యోగి కొమ్మా పార్థసారధికి డాక్టరేట్ లభించింది. ఆయన 'ఆసనం, ప్రాణాయామం అభ్యాసాలతో ఆరోగ్య, నైపుణ్య సౌకర్యాలపై, సర్క్యూట్ శిక్షణ యొక్క ప్రభావం' అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన సమర్పించిన పత్రాలను ఎస్వీయూ బోర్డు ఆమోదించింది. దీంతో ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ అవార్డును ప్రకటించింది. త్వరలో డాక్టరేట్ పట్టాను అందుకోనున్నారు.



ఉఫ్.. ఊదండి

తిరుపతి నగరంలో ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యాన పోలీసులు మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్‌పై తనిఖీలు జరిపారు. బ్రీత్ అనలైజర్‌తో టెస్టు చేసి.. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పలువురిపై కేసులు నమోదు చేశారు. పట్టుబడ్డ వారిలో ప్రముఖులు కూడా ఉన్నారు.



సాంస్కృతిక సందడి

నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా మంగళవారం రాత్రి తిరుపతిలో పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందరూ సందడి సందడిగా 2025కి స్వాగతం పలికారు.



కేకుల సందడి

నూతన ఆంగ్లసంవత్సరాది కోసం మంగళవారం రాత్రి తిరుపతిలో కేకుల కొనుగోళ్లకు జనం బారులు తీరారు. బేకరీలు, స్వీటు స్టాళ్ల వద్ద సందడి నెలకొంది. రకరకాల కేకులు కనువిందు చేశాయి. బహిరంగ ప్రదేశాల్లోనూ కేకుల విక్రయాలు సాగడం విశేషం.



తిరుమలలో రద్దీ

అర్ధరాత్రి తర్వాత తిరుమల శ్రీవారి ఆలయం ముందు భక్తులు సందడి చేశారు. తీవ్రమైన రద్దీ నెలకొంది. నూతన ఆంగ్ల సంవత్సరం ఆగమ వేళ ఆలయ పరిసరాలు గోవింద నామ స్మరణతో మార్మోగాయి. భక్తులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కొత్తగా పరకామణి-2 అక్రమం

- 2023లోనే వెలుగులోకి తెచ్చిన టీటీడీ విజిలెన్స్ నివేదిక
- అయినా, చర్యలు తీసుకోని అధికారులు
- తొలి ఘటనలో చేతివాటంపై సీసీ ఫుటేజీ గల్లంతు
- టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపణ

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా పరకామణి-2 అక్రమం వెలుగులోకి వచ్చినట్లు టీటీడీ సభ్యుడు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమలలో భక్తులు పోగొట్టుకున్న బంగారు వస్తువులు, సెల్‌ఫోన్లు తదితరాలను కమాండ్ కంట్రోల్ అధికారులు, సిబ్బంది దోచుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని గతేడాది జూన్ 13 నాటి టీటీడీ విజిలెన్స్ రిపోర్ట్ ప్రకారమే తాను చెబుతున్నానని చెప్పారు. ఇందులో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ కీలకమన్నారు. తిరుమలలో భక్తులు పోగొట్టుకున్న వస్తువులను విజిలెన్స్ శాఖ రికవరీ చేసి అందజేస్తారన్నారు. ఒకవేళ సంబంధిత వ్యక్తులు రాకపోయినా, వారెవరో తెలియకపోయినా ఆ సొత్తును శ్రీవారి హుండీలో వేస్తారని వివరించారు. హుండీలో వేసే క్రమంలో కొందరు విజిలెన్స్ అధికారులు చాలావరకు దాచేసుకున్నారని విమర్శించారు. వీఐ రవిశంకర్ ఇలాంటి అక్రమాలకు పాల్పడ్డట్టు 2023 నాటి విజిలెన్స్ విచారణలో స్పష్టమైనట్లు నివేదికలో ఉందన్నారు. ఇలా సుమారు రూ.5 కోట్ల వరకు శ్రీవారి, భక్తుల సొత్తును కాజేసినట్టు తనవద్ద సమాచారం ఉందన్నారు. ఇక, భక్తులు పోగొట్టుకున్న నగదును విజిలెన్స్ అధికారులు రికవరీ చేయగా, అధికారులు కార్యాలయ స్టేషనరీకి వినియోగించుకున్నట్టు స్పష్టమవుతోందని విజిలెన్సు నివేదిక చూపారు. ఇక, గతంలో పరకామణి ఉద్యోగి రవికుమార్ శ్రీవారి హుండీని కొల్లగొడితే నామమాత్రపు సెక్షన్లతో కేసు నమోదుచేసి, అప్పటి టీటీడీ అధికారులు లోక్‌అదాలత్‌లో రాజీ చేయించారన్నారు. అయితే రవికుమార్ పరకామణి సమయంలో చేతివాటంకు సంబంధించిన సీసీ ఫుటేజీ మాయమైనట్టు తెలిసిందన్నారు. కాగా, పరకామణి కేసుకు సంబంధించి నిందితుడు రవికుమార్‌ను తనిఖీ చేసేటపుడు, విచారించేటపుడు వీఐ రవిశంకర్ ఉన్నారని, ఆయనే పరకామణి సీసీ ఫుటేజీని డిలీట్ చేసుంటారని భానుప్రకాష్ అనుమానించారు. ఇన్ని అక్రమాలకు పాల్పడిన రవిశంకర్‌పై అప్పటి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా మాతృశాఖకు బదిలీ చేశారన్నారు. వీటన్నింటిపై త్వరలో సీఎం చంద్రబాబును కలిసి వివరించి, టీటీడీని పూర్తిగా ప్రక్షాళన చేయాలని కోరతానన్నారు.



నివేదిక చూపి వివరాలు వెల్లడిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి



హ్యాపీ న్యూ ఇయర్

మంగళవారం రాత్రి 12 గంటలు దాటగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. కేకులు కట్ చేశారు.

హడలెత్తించిన నాగుపాము



తిరుమలలో అత్యంత రద్దీగా ఉండే రాంభగీచ సత్రాల వద్ద మంగళవారం ఐదు అడుగుల పొడవైన నాగుపాము భక్తులను హడలెత్తించింది. బస్టాండులో పామును గుర్తించిన భక్తులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

\- తిరుమల, ఆంధ్రజ్యోతి

సంస్కృత వర్సిటీలో క్రీడా మహోత్సవం

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సంస్కృత వర్సిటీ‌ఓ మంగళవారం సౌత్‌జోన్ సంస్కృత విద్యార్థుల క్రీడా మహోత్సవం జరిగింది. విజేతలుగా నిలిచిన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం క్రీడాకారులకు 15బంగారు పతకాలు, మూడు సిల్వర్ మెడల్స్‌ను అతిథులు ప్రదానం చేసి ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేశారు. ఒడిశా రాష్ట్ర విధాన సభాపతి సురమపాడి, శాప్‌ఛైర్మన్ ఎ.రవినాయుడు, వర్సిటీ వీసీ జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి, క్రీడా సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కె.ఎస్.సతీష్, ఫిజికల్ డైరెక్టర్ వి.సేతురామ్, రంగనాథన్ పాల్గొన్నారు.



మాలలను అణిచివేసే కుట్ర జరుగుతోంది

- మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో మాలలను అణిచివేసే కుట్ర జరుగుతోందని మాల మహాసభ జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు విమర్శించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన పేరుతో మాలలకు ద్రోహం తలపెడుతున్నారన్నారు. రెండు రాష్ట్రాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా మాలలు అత్యధిక జనాభా ఉన్నారని, ఐతే మాలలకు కాకుండా తక్కువ జనసంఖ్య ఉన్న మాదిగలకు అధికశాతం రిజర్వేషన్ కల్పించే దిశగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఉభయ రాష్ట్రాల్లో మాలల జనాభా శాతం అధికంగా, మాదిగలు తక్కువగా ఉన్నందున మాదిగలకే రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ పరంగా ఎక్కువ రిజర్వేషన్లు కట్టబెట్టేందుకే ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు మాదిగల పక్షాన ఎత్తులు వేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో 9 మంది సిట్టింగ్ జడ్జిలు ఇచ్చిన తీర్పును కాదని నలుగురు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పు ప్రామాణికంగా తీసుకుని రిజర్వేషన్లు ప్రకటించడం ఏంటని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులను మల్లెల వెంకట్రావు ప్రశ్నించారు.

జనాభా లెక్కల ఆధారంగా కుల విభజన చేయడం సరికాదు: సుప్రీంకోర్టు బ్రాహ్మణ అగ్రహారంగా మారిందని వెంకట్రావు విమర్శించారు. వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారులు ఉన్నాయని సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తున్నామని ఆ తీర్పు రాజ్యాంగానికి కూడా వ్యతిరేకమని వివరించారు. వలంటీర్లు ఇచ్చిన జనాభా లెక్కల ఆధారంగా కుల విభజన చేయడం సరైన పద్ధతి కాదని, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమిషన్ మాత్రమే కుల గణన చేపట్టాలన్నారు. ఆమేరకు ప్రభుత్వ ఏజన్సీ ద్వారా జనగణన, కుల గణన చేయాలని డిమాండ్ చేశారు. మాల మహాసభ నాయకులు మల్లారపు మధు, అజయ్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

3న మెగా జాబ్ మేళా

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో ఈనెల 3న జరిగే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం మెగా జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, అధికారులు మురళీకృష్ణ, గణేష్, శ్రావణి, సురేష్ పాల్గొన్నారు.

బార్‌పై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): లీలామహల్ వద్ద బడి బార్‌పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్ధరాత్రి 11 గంటల వరకు మాత్రమే బార్‌లకు అనుమతి వుంది. కానీ బడిబార్‌లో అర్ధరాత్రి 12 గంటల దాటినా నిబంధనలను బేఖాతరు చేసి మందుబాబులను లోపల కూర్చోపెట్టి వ్యాపారం చేస్తున్నారు. దీంతో బార్‌పై తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ

తిరుపతిరూరల్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం చిగురువాడలో మంగళవారం కూటమి పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే పులివర్తి నాని.. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ రూరల్‌మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ ముచ్చేలి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కూటమి నాయకులు మురళి, శ్రీనివాసులుయాదవ్, శివాయాదవ్, మునిశేఖర్‌రాయల్, కురకాల్వ సుధాకర్, కృష్ణమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ రిటైర్డ్ ఉద్యోగికి మాజీ ఎంపీ నివాళి

చంద్రగిరి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురానికి చెందిన గల్లా అరుణకుమారి అభిమాని, టీటీడీ రిటైర్డు ఉద్యోగి తలియాకుల లక్ష్మయ్యకు మాజీ ఎంపీ గల్లా జయదేవ్ నివాళులర్పించారు. ఇటీవల లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం ఆయన కర్మక్రియలు జరిగాయి. టీడీపీ నాయకులు బడి సుధాయాదవ్, ఆనందనాయుడు, బెల్లంకొండ రమేష్‌రాయల్, చిన్నగొట్టిగల్లు శివకుమార్, వైసీపీ నేతలు మస్తాన్, మల్లం చంద్రమౌళిరెడ్డి, పాల్గొన్నారు.

సాంకేతిక అభివృద్ధిలో ఖ్యాతి గడించాలి


ప్రయోగాలను పరిశీలిస్తున్న భానుప్రసాద్

శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సాంకేతిక అభివృద్ధిలో పరిజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ అన్నారు. పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మండల సైన్స్ ఫేర్ ఎగ్జిబిట్‌ను మంగళవారం ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి అంశాన్ని కూలంకషంగా తెలుసుకుంటూ అందులోని నూతన ఒరవడిని సాధించేందుకు విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలను కనుగొనాలన్నారు. అనంతరం మండలస్థాయిలో మూడు విభాగాల కింద ప్రథమ స్థానం సాధించిన మూడు ఎగ్జిబిట్లను జనవరి 3న జరిగే జిల్లాస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

హడలెత్తించిన నాగుపాము



తిరుమలలో అత్యంత రద్దీగా ఉండే రాంభగీచ సత్రాల వద్ద మంగళవారం ఐదు అడుగుల పొడవైన నాగుపాము భక్తులను హడలెత్తించింది. బస్టాండులో పామును గుర్తించిన భక్తులు భయంతో కేకలు వేస్తూ పరుగులు తీశారు. పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్

సత్యవేడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రవి తెలిపారు. సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించారు. వ్యక్తిగత కేటగిరి నుంచచి సత్యవేడు బాయ్స్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి ఎస్.జశ్వంత్ ప్రదర్శించిన హోం సెక్యూరిటీ అలారం మొదటి స్థానం సంపాదించుకుంది. గ్రూప్ కేటగిరిలో ఇరుగుళం జడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులు టి.చరణ్‌కుమార్, సి.శ్యామ్ ప్రదర్శించిన రోబో ఫర్ హోటల్ సర్వింగ్ అండ్ క్లీనింగ్ మొదటి స్థానంలో నిలిచింది. టీచర్స్ కేటగిరిలో సత్యవేడు బాయ్స్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి కార్తీక్ ప్రదర్శించిన భూకంపం అలారం మొదటి స్థానంలో నిలిచినట్లు ఎంఈవో తెలిపారు. ఈ ప్రదర్శనలు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో 2 ఉష, హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న అధికారులు

ఆక్రమణలను తొలగించండి
సీపీఎం

పిచ్చాటూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారూరు గ్రామంలో కొందరు చెరువును, శ్మశాన బాటను ఆక్రమించుకున్నారని తక్షణం వాటిని తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి రామచంద్రా రెడ్డి తహసీల్దార్ రమేష్‌బాబుకు వినతి చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పేదల భూములు ఆక్రమణకు గురి అవుతున్నాయని పేర్కొన్నారు. ఏకే బేడు, గోవర్ధనగిరి గ్రామాల్లో జీవన భృతి కోసం వలస వెళ్లిన వారి భూములు ఆక్రమణకు గురవడమే ఇందుకు నిదర్శనమన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): చెరువులో పడి మునస్వామి(68) మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం శ్రీకాళహస్తి మండలంలోని అరవ కొత్తూరులో జరిగింది. బుచ్చినాయుడు కండ్రిగ మండలం కల్లివెట్టుకు చెందిన మునస్వామి అరవ కొత్తూరులోని బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం బహిర్భూమి కోసం చెరువు కట్ట మీదకు వెళ్లాడు. అదుపు తప్పి కిందకు పడటంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పంట కాలువ ఆక్రమణపై విచారణ చేపట్టండి
చర్యలు చేపతామన్న అధికారులు

వరదయ్యపాళెం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పంట కాలువలను ఆక్రమించడమే కాకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న స్థానికేతర వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని బత్తలవల్లానికి చెంది యువకులు డీటీ వెంకట సుబ్బయ్య, ఎస్‌ఐ మల్లికార్జునకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీసిటీ కారణంగా ఇక్కడి భూములకు గిరాకీ పెరగడంతో ఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. బత్తులవల్లం వద్ద భూమి కొని నిర్మాణం చేపట్టిన స్థానికేతర వ్యాపారి తన భవనానికి పక్కన ఉన్న పంట కాలువ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. దీంతో పొలాలకు సాగునీరు అందక ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిపై విచారించి న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ప్రమాణ స్వీకారానికి ఆహ్వానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా దూండి రాజేష్ ప్రమాణ స్వీకారానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మను టీడీపీ నాయకుడు వాకిచర్ల గుర్రప్పశెట్టి ఆహ్వానించారు. మంగళవారం ఆయన బృందమ్మకు ఆహ్వాన పత్రిక అందజేశారు. 5వ తేదీ విజయవాడలోని గాంధీజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.



ఎంపీడీవో కార్యాలయ మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి
జడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య

ఏర్పేడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని జడ్పీటీసీ సభ్యుడు కావేరి తిరుమలయ్య కోరారు. మంగళవారం చిత్తూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నారు. దాదాపు అన్ని గదులు చిన్నపాటి వర్షానికే లీకేజీ అయి సిబ్బంది విధులు నిర్వహించ లేకపోతున్నారన్నారు. మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని కోరారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీనివాసులు, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు అందుకు సానుకూలంగా స్పందించారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం







నారాయణవనంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం - శివనాథపాళెం, అంజూరుల్లో జరిగిన రెవెన్యూ సదస్సులు

నారాయణవనం, డిసెంబర్ 31(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరిస్తారని ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. మంగళవారం నారాయణవనంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సమస్యలే అధికంగా ఉండడంతో సీఎం చంద్రబాబు వాటిని 45 రోజుల్లో పరిష్కరించేలా సదస్సులు నిర్వహణకు శ్రీకారం చుట్టారన్నారు. గత వైసీపీ పాలనతో చుక్కల భూములు, భూఆక్రమణలు, పాస్ బుక్‌లలో అక్రమాలు అరికట్టి రైతాంగానికి అండగా ఉండడం కోసం అధికారులు ప్రజల వద్దకే వచ్చేలా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆర్‌డీ ఏకాంబరం, గోవిందస్వామి, భాస్కరన్, సర్పంచ్‌లు కేపీ గణేషన్, శారదమ్మ, మురుగేషన్, రమేష్, తహసీల్దార్ జయరాములు, ఎంపీడీవో గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన రావు తెలిపారు. మండలంలోని శివనాథపాళెంలో మంగళవారం ఉదయం రెవెన్యూ సదస్సు జరిగింది. పలువురు రైతులు, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేశారు. శ్రీకాళహస్తి మండలంలో కాపుగున్నేరిలో తహసీల్దారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది.

కేవీబీపురం: భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులునాయుడు అన్నారు. మండలంలోని అంజూరులో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... అర్జీలను నిర్దీ గడువులోగా పరిష్కరిస్తారన్నారు. అలాగే సూరమాల గ్రామంలో కూడా రెవెన్యూ సదస్సు జరిగింది. ఆయా సదస్సుల్లో తహసీల్దారు మునిరత్నంరెడి, మాజీ సర్పంచ్ ముకేష్‌రెడ్డి, వెంకటరత్నం, రవి, బాబు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని అత్తూరులో మంగళవారం తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో గ్రామస్తుల నుంచి భూసమస్యలపై నాలుగు దరఖాస్తులు వచ్చాయి. పరిశీలించిన తహసీల్దారు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని బొజ్జల బృందమ్మ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఐదుగురు లబ్ధిదారులకు రూ.7,21,798 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. అంకయ్య చౌదరి, విజయకుమార్, కంఠా రమేష్, సుమతి, మల్లీశ్వరి, గోపీనాథ్‌చౌదరి, అర్ముగం, పాండు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో రాజంపేట ఎంపీ మిథున్



శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వరస్వామిని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వగత్తూరు చెరువుకు గండి

● వెంటనే స్పందించిన ఇరిగేషన్ అధికారులు



గండి పూడుస్తున్న గ్రామస్తులు, ఇరిగేషన్ సిబ్బంది

కేవీబీపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని వగత్తూరు పెద్ద చెరువుకు గండి పడింది. గత వారం కురిసిన వర్షాలకు చెరువు పూర్తిగా నిండి కొద్దికొద్ది ఊట బయటకు రావడం జరిగింది. అయితే ఇది పెద్దప్రమాదం కాదని గ్రామస్తులు అనుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా చెరువుగట్టు కోతకు గురై గండి పడింది. వెంటనే అప్రమత్తమైన ఇరిగేషన్ ఏఈ బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు యుద్ధప్రాతపదికన ఇసుక బస్తాలతో తాత్కాలికంగా గండిని పూడ్చివేశారు.

క్రీడా పోటీల్లో సత్తా చాటిన ఎంజేపీబీ విద్యార్థులు



సత్యవేడు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఖోఖో పోటీలో సత్తా చాటారు. సత్యసాయి జిల్లా లేపాక్షిలోని మహాత్మ జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలలో 27, 28 తేదీల్లో ఫోర్త్ జోన్ స్కూల్ లెవల్ స్థాయిలో ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. సత్యవేడు ఎంజేపీబీ పాఠశాల నుండి పీఈటీ నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖోలో విజేతలుగా నిలవగా, చెస్‌లో ద్వితీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో మూడో స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎస్టీయూ క్యాలెండర్లను మంగళవారం ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కన్వీనర్ పూడి సుధాకర్, ఎస్టీయూ నాయకులు హరికృష్ణ, రమణయ్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీలు, క్యాలండర్ల ఆవిష్కరణ

వరదయ్యపాళెం: మండలకేంద్రంలో మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈవో సరస్వతి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణారెడ్డి, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



సుంకర బత్తెయ్య(ఫైల్ ఫొటో)

కేవీబీపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశంలో రైతు సుంకర బత్తెయ్య(35) విద్యుదాఘాతంతో మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు... మంగళవారం సాయంత్రం పొలంలో ఉన్న విద్యుత్ మోటర్ ఆన్ చేయడానికి వెళ్లిన బత్తెయ్య విద్యుదాఘాతంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. సమీపంలో ఉన్న రైతులు గుర్తించి అక్కడికి చేరుకునేలోపే బత్తెయ్య మరణించాడు. బత్తెయ్యకు భార్య అరుణ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నాగలాపురంలో రూ 2.82 లక్షల మద్యం ధ్వంసం



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల్లో పట్టుబడి సీజ్ చేసిన రూ.27,000 విలువైన డ్యూటీ పెయిడ్ లిక్కర్ 229 బాటిళ్లను, రూ 2.28లక్షలు విలువ కలిగిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ 2880 బాటిళ్లను, 55 లీటర్ల సారాను మంగళవారం అధికారులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి, అదనపు ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, ఎన్‌ఫోర్సుమెంటు సీఐ శ్యామ్, నాగలాపురం ఎక్సైజ్ సీఐ దశరథ, సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదానం ప్రాణదానంతో సమానం



తిరుపతి అర్బన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షులు శంకర్‌యాదవ్ సూచించారు. మంగళవారం స్థానిక కేటీరోడ్డులోని ఆయన కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. స్నేహితులు, అభిమానులు దాదాపు 100మంది రక్తదానం చేశారు. బుధవారం ఆయన జన్మదినం పురస్కరించుకొని రుయా ఆస్పత్రి ముందు పేదలకు అన్నదానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, అవినాష్, సాయి, శీను, చైతన్య, నితీష్ పాల్గొన్నారు.

అగస్తీశ్వరాలయం పరిశీలన





అగస్తీశ్వరాలయానికి వచ్చిన ఈవోను స్వాగతిస్తున్న అర్చకులు - స్వామివారిని దర్శించుకుంటున్న ఈవో

శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలిలో కొలువై ఉన్న దుర్గాదేవి సమేత అగస్తీశ్వరాలయాన్ని గ్రామస్తుల ఆహ్వానం మేరకు మంగళవారం ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో నీటి లీకేజీ అరికట్టాలని, ఆలయ ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మించాలని, ప్రసాదాల తయారీకి వంటశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఈవోను కోరారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



ఏర్పేడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేట పంచాయతీలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేశారు. రూ.10లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టడానికి వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు కృష్ణప్ప మొదలియార్, అర్జున్‌బాబు, రవికుమార్, సీతాపతి ఆచారి, నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు అందక అసంపూర్తిగా...





కళత్తూరులో అసంపూర్తిగా ఆరోగ్య ఉపకేంద్రం - పునాదులకే పరిమితమై పిచ్చి కంపలు మొలచిన రాయపేడు సచివాలయ భవనం



బిల్లులు అందక ఆగిన కేజీబీవీ తరగతి గదులు

కేవీబీపురం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించక నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ పాఠశాలలో 2023-24 సంవత్సరంలో ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.80లక్షల టెండర్‌ను వైసీపీ నాయకులు దక్కించుకున్నారు. అయితే నిర్మాణాలు సగం పూర్తైనా బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. అలాగే కళత్తూరులో సచివాలయానికి అనుసంధానంగా మినీ ఆరోగ్య కేంద్ర నిర్మాణం చేపట్టారు. శ్లాబ్ పనులు పూర్తైనా మిగిలిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆ భవనం కాస్త పశువుల కొట్టంగా మారింది. రాయపేడులో సచివాలయ నిర్మాణానికి పిల్లర్లు వేశారు. దానికీ బిల్లులు అందకపోవడంతో కంపచెట్లు పెరిగిపోయాయి. ఇలా చెప్పుకుంటు పోతే చాలా వరకు నాడు-నేడు పనుల్లో కూడా అసంపూర్తి నిర్మాణాలు చాలా ఉన్నాయి. అంజూరు, సిద్ధగుంట పాఠశాలలలే ఇందుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని అసంపూర్తి భవనాలను పూర్తి చేయాల్సి ఉంది.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు





ఏర్పేడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాపల్లి దళితవాడలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈనెల 30న 'పారిశుధ్య అధ్వానం' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. జంగాలపల్లిలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారంటూ వార్త ప్రచురితమైంది దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు జంగాలపల్లి దళితవాడలో పారిశుధ్య మెరుకుగు చర్యలు చేపట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో వీధుల్లో నిల్వ చేరిన మురుగు తొలగించారు. మురుగుకాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



శ్రీకాళహస్తి, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచగున్నేరిలో మంగళవారం టీడీపీ నమోదు కార్యక్రమం జరిగింది. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను టీడీపీ సీనియర్ నాయకుడు బొల్లినేని జగన్నాథంనాయుడు వివరించారు. మహిళలుపెద్దసంఖ్యలో టీడీపీ సభ్యత్వం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు అంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నరేష్



ఏర్పేడు, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా తిరుమలశెట్టి నరేష్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఏర్పేడులో మంగళవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ ఆధ్వర్యంలో సమాశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ... పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

అభినందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది సాంస్కృతికోత్సవంలో ఎస్వీయూ విజేతగా నిలవడం పట్ల వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభినందించారు. ఇందుకు కృషి చేసిన వర్సిటీ కల్చరల్ అఫైర్స్ అధికారులు మురళీధర్, పత్తిపాటి వివేక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పాకనాటి హరికృష్ణ, రంజిత్, చంద్ర, ఉదయ్ పాల్గొన్నారు.

సైన్సు ప్రయోగాలపై దృష్టి సారించండి



సైన్సు ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంఈవోలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్సు ప్రయోగాలపై దృష్టి సారించాలని ఎంఈవో రవీంద్రనాథ్ తెలిపారు. జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఎన్ కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని పలు పాఠశాల విద్యార్థులు సైన్సు ప్రయోగ నమూనాలను ప్రదర్శించారు. నమూనాలను ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయుడు రమణయ్యలు పరిశీలించి ఉత్తమ ప్రదర్శనలు చేపట్టిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనాలే నా ధ్యేయం

ఎమ్మెల్యే ఆదిమూలం



గంగాప్రసాద్‌ని సన్మాంచి నూతన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు

పిచ్చాటూరు/ వరదయ్యపాళెం, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా క్షేత్రంలో ప్రజా ప్రయోజనాలే తన అభివృద్ధి మంత్రమని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌ను సూళ్లూరుపేటలోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి ఆంగ్లసంవత్సరాది ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ సీనియర్లు తనకు సహకరిస్తే కొత్త ఏడాదిలో అభివృద్ధిలో దూసుకెళ్తానని చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, రవిరెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. సూళ్ళూరుపేటలో మంగళవారం పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌ను ఆయన నివాసంలో వరదయ్యపాళెం టీడీపీ యువ నాయకుడు ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఆయనను ఘనంగా సన్మానించారు.

ట్రాప్ కెమెరాల ఏర్పాటు

చిరుత కదలికలను పసిగట్టేందుకు చర్యలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 31: చిరుత సంచారం నేపథ్యంలో ఎస్వీయూలో పది ట్రాప్ కెమెరాలు ఏర్పాటయ్యాయి. యూనివర్సిటీ అధికారుల విన్నపం మేరకు అటవీ అధికారులు ఈ కెమెరాలను చెట్లకు ఏర్పాటు చేశారు. తద్వారా ఏ ప్రాంతంలో, ఏ సమయంలో చిరుత సంచరిస్తుందో గుర్తించనున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. అయినా రాత్రి వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు బయట సంచరించవద్దని కోరారు.

ఉబ్బలమడుగులో నీటమునిగి తమిళనాడు యువకుడి మృతి



డేనియల్ కింగ్‌స్టన్ (ఫైల్ ఫొటో)

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉబ్బల మడుగు జలపాతంలో నీట మునిగి తమిళనాడుకు చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉబ్బల మడుగు జలపా తానికి సోమవారం తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా తిరునత్తూరుకు చెందిన డేనియల్ కింగ్‌స్టన్ సహా ఐదుగురు స్నేహితులు విహారయాత్రకు వచ్చారు. డేనియల్ కింగ్‌స్టన్(21) స్నేహితులతో కలసి ఉబ్బలమడుగలోని ఎగువశీతలంకు వెళ్లి నీటిలో దూకాడు. లోతు ఎక్కువగా ఉండడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు నీటిలో గాలించినా ఆచూకీ దొరకలేదు. దీనిపై బీఎస్‌కండ్రిగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక, అటవీశాఖలకు సమాచారం అందించారు. వారి సాయంతో నీటిలో గాలించగా రాళ్ల మధ్యలో చిక్కుకుని ఉన్న డేనియల్ కింగ్‌స్టన్ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.